# సిటీకి అదనపు బలగాలు



బాలానగర్ డీసీపీ కార్యాలయంలో బుధవారం సీపీ స్టీఫెన్ రవీంద్ర నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న డీసీపీ టి.శ్రీనివాసరావు, మేడ్చల్ డీసీపీ శబరీష్, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు తదితరులు

## మరో 12 ప్లాటూన్లు

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే సున్నిత ప్రాంతాలను గుర్తించిన పోలీసు అధికారులు.. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. ఎన్నికల బందోబస్తు కోసం కేంద్ర బలగాలతో పాటు 12 ప్లాటూన్ల అదనపు బలగాలను రంగంలోకి దింపినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈనెల 30న జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్, షాద్‌నగర్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, చేవెళ్ల, కూకట్‌పల్లి నియోజకవర్గాలలో ఎన్నికల బందోబస్తుపై సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర.. స్థానిక డీసీపీలతో సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఉన్న సున్నిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలతో పాటు స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతో పాటు అదనపు బలగాలతో భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి కమిషనర్ వరకు ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని, ఇతర ప్రభుత్వ శాఖలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సీపీ స్టీఫెన్ రవీంద్ర పోలీసు సిబ్బందికి సూచించారు. ఎక్కడ కూడా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చూడాలని, ఉల్లంఘించిన వారిని ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నించే వారిపై నిఘా పెట్టాలని, ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నుంచి అందిన ఆదేశాల నేపథ్యంలో పోలీసు అధికారులు ప్రచార పర్వంతో పాటు రాజకీయ పార్టీల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు.

### పటిష్ట బందోబస్తుపై పోలీసుల కసరత్తు

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక నుంచి ఎన్నికల ప్రచారం మరింత జోరందుకోనున్నది. రాజధాని నగరంలో ప్రచారంపై ఆయా పార్టీల అధినాయకత్వం దృష్టి పెట్టింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం నాయకుల ప్రచారాలు, రోడ్ షోలతో ఇక నగరంలో రాజకీయ సందడి మరింత పెరుగనున్నది. ఎన్నికల వేడి పెరుగుతుండటంతో ఆయా పార్టీల మధ్య వివాదాలకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని బందోబస్తును మరింత పెంచుతున్నారు. ఇప్పటికే కేంద్ర బలగాలు నగరానికి చేరుకున్నాయి. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలలో భాగంగా నవంబర్ 7వ తేదీన చత్తీస్‌ఘడ్‌లో మొదటి ఫేజ్ ఎన్నికలు జరుగగా.. రెండో ఫేజ్ 17వ తేదీన జరుగుతున్నాయి. అలాగే, మధ్యప్రదేశ్‌లో కూడా 17వ తేదీన మొదటి దఫా ఎన్నికలు జరుగనున్నాయి. తెలంగాణలో నవంబర్ 30వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. దీంతో ఆయా రాష్ట్రాలలో ఎన్నికలు పూర్తి కావడంతో కేంద్ర బలగాలను తెలంగాణకు దఫ దఫాలుగా వస్తున్నాయి. ఇదిలా ఉండగా.. ప్రచారాలు, రోడ్‌షోలు నిర్వహించేందుకు అన్ని పార్టీల అగ్రనాయకులు నగరానికి వస్తున్నారు. దీనిపై ట్రై పోలీస్ కమిషనరేట్ల పోలీసు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. రోడ్ షోలు, సభలకు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ప్రశాంతంగా ఉన్న పాతబస్తీలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.



చెక్‌పోస్టు వద్ద సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

### చెక్‌పోస్టులను తనిఖీ చేసిన సీపీ డీఎస్ చౌహాన్

ఎన్నికల భద్రత, చెక్ పోస్టులలో సిబ్బంది పనితీరును రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ పరిశీలించారు. పెద్ద అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తగూడ చెక్‌పోస్టును బుధవారం సందర్శించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాల తనిఖీలకు సంబంధించిన విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు కావాల్సిన అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతున్నట్లు సీపీ వివరించారు. అవసరమైన చోట మరిన్ని చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామని, అక్రమ నగదు, మద్యాన్ని అడ్డుకోవడానికి పటిష్ట నిఘాను ఏర్పాటు చేశామన్నారు.

### నగదు అక్రమ రవాణాపై పటిష్ట నిఘా: సీపీ

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో తీసుకున్న చర్యలపై జిల్లా వ్యయ పర్యవేక్షకులు, ఎన్నికల అధికారులతో బుధవారం రాచకొండ సీపీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి తీసుకున్న భద్రతా చర్యలు, చెక్‌పోస్టులు, అక్రమ నగదు, మద్యం, డ్రగ్స్ తరలింపు కేసులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర శాఖల అధికారులు తమ శాఖ తరపున చేపట్టిన ఆయా కార్యక్రమాల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా సీపీ చౌహాన్ మాట్లాడుతూ.. రాచకొండ పరిధిలో అవసరమైన అన్నిచోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి.. పకడ్బందీగా తనిఖీలు చేస్తున్నామన్నారు. తనిఖీలు నిర్వహించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమంగా తరలించే నగదు, మద్యం ఇతర వస్తువులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సమక్షంలో సీజ్ చేయిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో భువనగిరి జోన్ డీసీపీ రాజేష్ చంద్ర, ఐఏఎస్ అధికారి కొండిగ హనుమంత్, ఐపీఎస్ విపుల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విస్తృతంగా తనిఖీలు..రూ.3.58 కోట్ల నగదు సీజ్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ తనిఖీల్లో భారీ స్థాయిలో నగదు, అక్రమ మద్యం పట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా బుధవారం ఒక్కరోజు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.1,15,000 పట్టుకున్నారు. ఇప్పటి వరకు రూ.3,58,47,450 నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ తెలిపారు. దీంతో పాటు పోలీస్ అథారిటీ ద్వారా రూ49,50,20,372 నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. 727 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. 3150 నక్కాస్ ఆపరేషన్స్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద రెండు కేసులు నమోదైనట్లు వెల్లడించారు.

## నాంపల్లిలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

సుల్తాన్‌బజార్, నవంబర్ 15: నాంపల్లిలోని ఏక్ మినార్ మసీదు ఎదురుగా ఉన్న అనీస్ ఉల్ గుర్బా వద్ద బుధవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. పాత ఫర్నీచర్‌తోపాటు రెండు ఆటోలు కాలిపోయాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. అనీస్ ఉల్ గుర్బా ప్రధాన ద్వారం ఎదురుగా నిత్యం ఆటో ట్రాలీలను పార్కింగ్ చేస్తారు. అక్కడే పాత ఫర్నీచర్‌ను కూడా పడవేస్తారు. బుధవారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే స్పందించి మంటలను అదుపు చేశారు. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రమాదంలో పాత ఫర్నీచర్ పూర్తిగా కాలిపోయింది. రెండు ఆటోలకు కూడా మంటలు అంటుకోవడంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. నాంపల్లి పోలీసులు అగ్ని ప్రమాద ఘనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### కోరిక తీర్చాలని జూనియర్ ఆర్టిస్టుకు వేధింపులు

వెంగళరావునగర్, నవంబర్ 15 : కోరిక తీర్చాలని జూనియర్ ఆర్టిస్టును వేధిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీ లోని మధనపల్లికి చెందిన ఓ మహిళా జూనియర్ ఆర్టిస్టు (32) సినిమా అవకాశాల కోసం హైదరాబాద్‌కు వచ్చి, రహ్మత్‌నగర్‌లో ఉంటున్నది. మూడు నెలల కిందట ఆ మహిళకు జయచంద్ర అనే వ్యక్తి నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. సినిమాల్లో అవకాశాలు మెండుగా ఉన్నాయని, సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అప్పటి నుంచి తన కోరిక తీర్చాలని వేధిస్తున్నాడు. అంతటితో ఆగకుండా పది రోజుల కిందట ఆమె స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడ ఆమె బంధువుల వద్ద చెడుగా చెప్పాడు. దీంతో మానసిక క్షోభకు గురైన ఆమె.. మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## స్టార్ హాస్పిటల్‌లో సీఓపీడీ క్లినిక్..



జూబ్లీహిల్స్, నవంబర్15: శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల ఆరోగ్య పరిరక్షణలో ఆరోగ్యకరమైన గాలి, వాతావరణం ప్రాముఖ్యతను సంతరించుకుంటాయని స్టార్ హాస్పిటల్ పల్మొనాలజిస్ట్ క్రిటికల్ కేర్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ చందనా రెడ్డి, వైద్యుల బృందం పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ సీఓపీడీ దినోత్సవం సందర్భంగా నగరంలోని స్టార్ హాస్పిటల్‌లో డెడికేటెడ్ క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనాలజీ డిసీజ్ (సీఓపీడీ) క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ క్లినిక్ సీఓపీడీ బాధిత రోగులకు ప్రత్యేక సంరక్షణ అందించడంతో పాటు వ్యాధి నిర్ధారణ.. అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పనిచేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్ పల్మొనాలజీ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ డాక్టర్ అనురాధ, డాక్టర్ కిషన్ శ్రీకాంత్ జువ్వ, డాక్టర్ కనిష్క కావూరి, డాక్టర్ లక్ష్మి భావన చుక్కపల్లి తదితరులు పాల్గొన్నారు.

## రూ. 7 లక్షల విలువైన వజ్రాలు చోరీ

### యువకుడి అరెస్ట్.. రిమాండ్

హిమాయత్‌నగర్, నవంబర్15: నగల దుకాణంలో పనిచేసే ఓ యువకుడు రూ.7 లక్షల విలువైన వజ్రాలను తస్కరించి.. పారిపోతుండగా నారాయణగూడ పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ యు. చంద్రశేఖర్ కథనం ప్రకారం.. హిమాయత్‌నగర్‌లోని సంఘీ జ్యువెలర్స్ కంపెనీలో బెంగాల్‌కు చెందిన రాహుల్ (29) మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 12వ తేదీన కంపెనీ యజమాని రవీందర్‌రెడ్డి వజ్రాలను సరిచూస్తుండగా.. కొన్ని వజ్రాలు కనిపించలేదు. అనుమానంతో జ్యువెలర్స్ కంపెనీలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా.. రాహుల్ చోరీ చేసినట్లు గుర్తించారు. రాహుల్‌ను అడగగా.. తనకు తెలియదంటూ బుకాయించాడు. దీంతో రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. డీఐ నాగార్జున, డీఎస్సై వెంకటేశ్, క్రైం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ ఫుటేజీలను మరోసారి పరిశీలించారు. రాహుల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. చేసిన నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు రాహుల్ నుంచి రూ.7లక్షల విలువైన వజ్రాలను స్వాధీనం చేసుకుని, బుధవారం రిమాండ్‌కు తరలించారు.

### గన్‌తో కాల్చుకుని..

## ఆర్మీ హవల్దార్ ఆత్మహత్య

మెహిదీపట్నం, నవంబర్ 15: గన్‌తో కాల్చుకుని ఆర్మీ హవల్దార్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పంజాబ్‌కు చెందిన రాజేందర్ సింగ్ (43) ఆర్మీలో హవల్దార్‌గా పనిచేస్తున్నాడు. 15 రోజుల కిందట టోలిచౌకి ఎండీ లైన్స్‌లో ఉన్న గన్నర్స్ యూనిట్‌కు బదిలీపై వచ్చాడు. బుధవారం తెల్లవారు జామున డ్యూటీలో ఉన్న అతడు తన వద్దనున్న గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న లంగర్‌హౌస్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం ఆర్మీ అధికారులకు మృతదేహాన్ని అప్పగించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని, అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రావు తెలిపారు.

## ప్రశాంత్‌ను కస్టడీకి ఇవ్వాలని జిల్లా కోర్టుకు సిట్

నాంపల్లి కోర్టులు, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో 16వ నిందితుడు సాన ప్రశాంత్‌రెడ్డి అలియాస్ ప్రశాంత్‌ను సిట్ కస్టడీకి అప్పగించాలని కోరుతూ అధికారులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఇటీవల నిందితుడి తరపున సిట్ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి.ఈశ్వరయ్య తిరస్కరించిన విషయం తెలిసిందే. దీంతో తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ అధికారులు జిల్లా కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. మరోవైపు నిందితుడి తరపున న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని పీపీని కోర్టు ఆదేశించింది. బుధవారం జిల్లా కోర్టులో సిట్ తరపున వాదనలు పూర్తికావడంతో తీర్పు వాయిదా పడింది.